ఈవారం కథ

# అన్నయ్యగారు

— పాటిబండ్ల రజని.

"అరరె. రండండి!"

"సుధా! సుధా! ఒక్కరోజైనా త్వరగా తెమల్చవుకదా! ఇవతల శేఖరన్నయ్య గారొచ్చేశారు కూడా!"

"వంటిల్లొదిలి రాలేని వాళ్ళంతా ఉద్యోగాల కెగబడితే ఇలానే ఉంటుంది! ఏదైనా మీ చెల్లాయి మహాజాగు మనిషి సుమండీ!"

కుర్చీలు జరుపుతున్న శబ్దంతో పాటు ఒక దానివెంట ఒకటిగా వినవస్తున్న సురేంద్ర వ్యాఖ్యలకు పచ్చిమిర్చి కోసిన చేత్తో కాటుక పెట్టుకున్న మంట ఒళ్ళంతా పాకింది సుధకు.

రిపోర్టింగ్ కోసం తమ ఆఫీస్ స్టాఫ్‌తో బయటకు బయల్దేరాల్సిన ప్రతి సారీ ఇదేతంతు! "చెల్లాయి, అన్నయ్యగారు!" మూర్ఖ బిళ్ళల్లా బలవంతాన అంటగడుతున్న ఆ కృతకమైన వరసలు విన్నాక వచ్చిన వాళ్ళ ముఖం చూడటానికి చచ్చేచావుగా ఉంటుంది తనకు!

ఇప్పుడొచ్చిన శేఖరానికి ఇంచుమించు తన వయసే ఉంటుంది! బాచిలర్ కావడం వల్లనో, మెయిన్‌టెయిన్ చేయడం వల్లనో ఇంకా చిన్నగానే కనిపిస్తాడు! అలాంటి అతనికి ఇద్దరు పిల్లల తల్లీ, ఉద్యోగంలో ఏడేళ్ళ సీనియారూ అయిన తను – 'చెల్లెలు'!

పాపం! అతనేవనుకుంటున్నాడో? "తన భార్యకు నేను లైనేస్తానని భయపడుతున్నాడీయన!" అనుకుంటున్నాడా? ఆఫీస్ సమయాల్లో తప్ప మిగిలిన వేళల్లో శారీరక వికలాంగుడిలా టి.వి ముందరి కుర్చీకి అతుక్కుపోయి కూర్చునే ఈయన 'మానసికంగా కూడా వికలాంగుడేమో'? అనుకుంటున్నాడా"?

అసలే అతను ఫోటోగ్రాఫరయ్యె! ఏ మనిషి ముఖంలో ఏ భావం వెనకాల ఏవుందో తేలిగ్గా పసిగట్టేయడూ? పసిగట్టి ఆ తాపత్రయం తాలూకూ మనిషిగా తనను చులకనగా అనుకోడూ?

కొంపదీసి, ఆఫీసు విషయాల్లో 'ఫలానా సమయంలో ఫలానా స్టిల్స్ సరిగ్గా తీయలేదేవని నిలదీసేప్పుడు' – 'ఈసారి కరక్టుగా తీస్తాలే చెల్లెమ్మ గారూ! అనడు గదా?' ఒకదానిపై ఒకటి వరసగా అమరిన కుచ్చిళ్ళ మీద కసిగా పిన్నుగుచ్చి, పెదవులు బిగబట్టి చరచరా బయటకు వడిచింది సుధ!

పట్టుకునేందుకేమీ లేని శేఖర్ బైక్ మీద కూర్చోగానే సుధ కోపమంతా ఎడిటర్ వైపు మళ్ళింది. రిపోర్టింగ్ కోసం దూరం వెళ్ళే స్టాఫ్‌కి ప్రయాణం ఖర్చులిచ్చేందుకు ప్రాణం తీసి కింద పెట్టుకుంటాడాయన! "చూడండి సుధా! రేపుదయాన్నే మీరూ మన శేఖరమూ వెళ్ళి ఈ ఇంటర్వ్యూ పూర్తిచేసుకురండి! పొద్దుపోయినా సరే! పని పూర్తికాకుండా మాత్రం రాకండి! మన శేఖరం ఉన్నాడుగా, మరేం భయంలేదులే!" అంటూ వెహికల్ ఉన్నవాళ్ళతో కలిపి పని అప్పజెప్పేస్తాడు తెలివిగా! ఈయనిచ్చే జీతం చాలక మూణ్ణెల్లకోసారి మారిపోయే వాళ్ళంతా కూడా 'మన లక్ష్మణ్', 'మన రామం', 'మన శ్రీనివాస్', 'మన శేఖరం'లా ఆత్మీయులే ఆయనకు! ఏ మనిషి ఎలాంటి వాడో తెలియకపోయినా 'మన' అని విధిగా అనుకోవాలి – లేదా – మనమూ మానేయాలి!

బండి గుంతలో పడటం, గుండె నిట్టూర్పు వదలడం ఒక్కసారే జరిగాయి! అప్రయత్నంగా అతని భుజం పట్టుకున్న చేతిని వెంటనే వెనక్కు తీసుకోవడానికి చిన్నతనంగా అనిపించింది సుధకు! 'ఇవి ఉండకూడనివీ, ఇవి ఉండాల్సినవీ' అంటూ ఎవరెవరో నిర్ణయిస్తున్న హద్దుల మధ్య "పట్టుకోవాలంటే పాతివ్రత్యం – విడిచిపెట్టాలంటే ప్రాణభయం"! తన స్థితికి తనకే నవ్వొచ్చింది సుధకు!

* * * * *

"పాపం నీమీదెంత ప్రేవో!"

"ఎవడికి?"

"ఛ! ఇంకెవరికి! మీ ఆయనకే!" గభాలున అనేసి ఎగాదిగా చూసి కళ్ళజోడు సర్దుకుంది అరుణ! (ప్రూఫ్ రీడరుద్యోగం చేసి చేసీ మనుషుల్ని కూడా కాయితాల్లా ఎగాదిగా చూడటం అలవాటైపోయిందామెకు!)

'నీ బొంద!' రాత్రి సురేంద్రతో పోట్లాడిన కసంతా అరుణ మీద చూపింది సుధ!

'కాకుంటే మరేమిటే? నీ గురించి ఎవరూ ఏవీ అనుకోగూడదనేగా అతని తాపత్రయం?' సమర్థించబోయింది అరుణ!

"ఛట్–నోర్ముయ్! నా మీద ప్రేముండటం అంటే నా మీద సమర్థన అవసరం లేని నమ్మకం ఉండటం! ఎవరి గురించిన భయాలనో నా మీద రుద్దని గౌరవం ఉండటం! నా గౌరవాన్ని నేను కాపాడుకోగలననే నమ్మకం ఉండటం! అంతేకాని లోకం వంకతో నా చుట్టూ కంచెలు కట్టడం, నా నెత్తిన మేకులు కొట్టడం ప్రేమెలా అవుతుందే?" చీదరించింది సుధ!

"ఒసే, ఒసే, అంత కాంపౌండు కాంప్లెక్సు సెంటెన్సులు అర్థమైతే నేను కూడా సబెడిటరే అయ్యేదాన్ని కదవే? కాస్త పలచన చేసి చెప్పవే!" సుధ మూడ్ మార్చే ప్రయత్నం చేసింది అరుణ.

"సరే! నువ్వన్న ప్రేమే ఉంటే – నేను మోపెడ్ కొనుక్కుంటాననంటే ససేమిరా అని తను హోండా కొనుక్కుంటాడా? అలా కొన్నవాడు ఏనాడైనా నన్ను డ్రాప్ చేయడం చూశావా? పైగా, "ఆడవాళ్ళు బండి తోలితే ఏం బావుంటుంది సుధా! చక్కగా ఆటో చేసుకువెళ్ళు! నీకు మాత్రం జీతం రావట్లేదా! అంటాడా? అంటే జీతాన్ని బట్టి తాహతుండాలి అని వెక్కిరించడమే కదా?" రోషం చిమ్ముతున్న కళ్ళతో సమాధానం చెప్పమన్నట్లు చూసింది సుధ!

"పోనీ – రోజూ బస్‌లో వచ్చేసి ఎక్కడికయినా బయటపన్లకి వెళ్ళేప్పుడు ఆ అబ్బాయిల బళ్ళెక్కకుండా ఆటో చేసుకుపోతే పోలా?" అమెరికాకి అడ్డదారి కనుక్కున్నంత సంబరం పడిపోయింది అరుణ!

"ఎందుకు పోలా? నా పరువేమైనా ఉంటే అది మాత్రం భేషుగ్గా పోతుంది! మన పత్రికల కోసం శోధించే మారుమూల ప్రాంతాలకు మనతో వచ్చి, మన పనైందాకా ఉండాలంటే మన జీతం మొత్తం ఇచ్చినా ఆటోవాడికి చాలదు! పోన్లే, వచ్చేప్పుడు స్వతంత్రంగా ఆటోలోవస్తానాయనా, వెళ్ళేప్పుడు మరో దారిలేదు కాబట్టి నీ బండెక్కుతాను! అంటే ఆ లిఫ్టిచ్చేవాడు మన చేతగాని తనాన్ని చూసి నవ్వుకోడూ?" బోడిసలహా అన్నట్లు మొహం పెట్టింది సుధ!

"ప్చ్! హాయిగా ఆ సుబ్బారావున్నంతకాలం బయటకెళ్ళే ఇంటర్వ్యూల పని చూసుకొచ్చేవాడు కదా! మరో మంచి ఉద్యోగం వచ్చిందండీ అనగానే సంబరంగా వెళ్ళిపొమ్మంటివే అతన్నీ!" మంచి సంబంధం తిరగ్గొట్టిన కూతుర్ని దెప్పే తల్లైపోయింది అరుణ!

"వెళ్ళమనక! మనలాగే ఈ త్రిశంకు స్వర్గాల్లో వేలాడమంటావా? అయినా నేను వద్దంటే ఆగిపోవడానికీ, వెళ్ళమంటే వెళ్ళడానికీ అతనేమైనా నా మేనత్త కొడుకా? నా తోటి కోడలి తమ్ముడా?" గయ్యిమన్న సుధకు రెండు చేతులూ జోడించి!

"వామ్మో! అసలే ప్రూవులు దిద్దీ దిద్దీ ఉన్నమతి పోయి నేనేడుస్తుంటే – గొలుసు రాతలాంటి నీ గోలేవిటే బాబూ! అయినా నీకే అన్నీ తెలుసు! నువ్వే ఆలోచించుకో! నే పోతా! అసలే మా హెడ్ ఇవాళ లంచ్‌కి కూడాపోలేదు" అంటూ లేచింది అరుణ! వెళ్ళబోతున్నదల్లా ఆగి, గొంతు తగ్గించి, "బిల్ కట్టేస్తావు కదా! పర్లేదు, త్వరలోనే మా పేపర్ కంప్యూటరైజ్ చేస్తారు. నాకూ ప్రమోషనొస్తుంది, తర్వాత నీ బిల్ కూడా నేనే కట్టేస్తాలే!" అనేసి టేబుల్ మీద ప్లేట్‌లో వున్న సోంపు మరికాస్త నోట్లో వేసుకుని వెళ్ళిపోయింది!

క్లిష్టంగా ఆలోచించడం కంటే కష్టాలుపడటమే నయమనుకునే అరుణ తత్వం తెలిసీ 'ఇష్' అంటూ నిస్సత్తువగా లేచింది సుధ కూడా!

* * * * *

సరిగ్గా వారం తర్వాత మోపెడ్ కొన్నాను పార్టీ ఇస్తారమ్మంటూ సుధ మంచి ఫోనొస్తే 'వ్వా' 'వ్వా' అంటూ సంబరంగా వచ్చింది అరుణ.

'హమ్మయ్య! ఎట్టకేలకు మీ ఆయన చేత బండి కొనిపించావన్నమాట; కంగ్రాట్స్' ఇక సమస్యలుండబోవనే ఆనందం కళ్ళలో చిమ్ముతుండగా

ఛరాలున కళ్ళు తెరిచింది సుధ! "సిగ్గులేదటే నీకు? కనిపించిన ప్రతి మగాడూ మనల్నేదో చేస్తాడని వణికిపోతూ, అన్నయ్యగారూ, బాబాయిగారూ అని వాళ్ళ సరసాల ఊహలమీద పవిత్రమైన మాటల సాంబ్రాణి పొగలేసుకుంటూ, వాటి మధ్య శీలవంతంగా వున్నామని భ్రమపడుతూ బ్రతకడం కంటే – చావడం నయం కదటే?" "అయినా మనం అన్నయ్య అన్నా, తండ్రీ అన్నా చివరకు 'కొడుకా' అన్నా అది మన నిస్సహాయతగా తీసుకుంటారు తప్ప మనం ఆశించినట్లుగా వాళ్ళెన్నడూ ఉండరు! అందుకే, అందుకే, వాళ్ళ బుర్రల్లో పుచ్చిపోయిన రొచ్చు–రోగం వాళ్ళ బుర్రల్లోనే ఉండనీ! ఎటు తిరిగీ ఆ రోగ క్రిమి మనదాకా రానివ్వని 'రెసిస్టెన్స్' మనం పెంచుకోవాలి' పట్టుదలగా పళ్ళు బిగబట్టి చెబుతున్న సుధకేసి బేలగా చూసి,

'ఎలాగే అది?' దీనంగా అడిగింది అరుణ.

'సూత్రం గొలుసు అమ్మెయ్యడం ద్వారా!' అరుణను మరింత ఏడిపిస్తున్నట్టు అంది సుధ!

'ఏం మాటలే శుక్రవారం పూట! దేనికో ముడిపెడతావ్ ప్రతిదీ'! విసుక్కుంటూ సుధ మెడకేసి చూసి 'నీ గొలుసేదే?' అనుమానంగా అడిగింది అరుణ!

'ఈ మధ్య కొత్త మోడలొచ్చిందిలే, గొలుసులు చెరిపి మోపెడ్‌లు చేస్తున్నారు' నవ్వుతోంది సుధ! 'ఏంవేళాకోళం' కసిరింది అరుణ!

'వేళాకోళం కాదు నిజమేనే! గొలుసమ్మేసి మోపెడ్ కొన్నాను'! గులాబ్‌జామ్ సుతారంగా కట్ చేసింది సుధ!

'నీ కేదో పిచ్చిపట్టింది! సురేంద్ర ఊరుకుంటాడా?' బజ్జీల ప్లేట్ పక్కకు




అనేసి కుర్చీలో కూర్చుంది నవ్వుతూ!

'చంపేస్తా ఆ మాటింకోసారంటే!' ఆమె ముందుకు జరుపుకున్న గులాబ్‌జామ్ ప్లేట్ పక్కకు జరుపుతూ సీరియస్‌గా అని, 'ముందివిచూడు' అంటూ ప్లేట్ స్థానంలో ఒక కవర్ పడేసింది సుధ!

సుధ అంత సీరియస్‌గా ఉండటం ఎప్పుడూ చూడని అరుణ ఒక్క క్షణం బిత్తరపోయి, మౌనంగా కవర్ విప్పింది! అందులోని మొదటి ఫోటో చూడగానే ఉలికిపాటుగా కళ్ళజోడు సర్దుకుని చకచకా మిగతావి చూసి 'ఏవిటే ఇవి? ఎవరు తీసారిలా?' గాభరాపడిపోయింది!

'అన్నయ్యగారు!' క్లుప్తంగా అంది సుధ!

వాడెవడు? చీదరగా ముఖం చిట్లించింది అరుణ.

"అదేనే! మా పత్రికలో పనిచేసే ఫోటో గ్రాఫర్ శేఖరం! ఇవాళ పొద్దుటే ఇంటర్వ్యూ ఫోటోల కవర్‌తో పాటే ఇవీ పంపాడు!" చెబుతుంటే జేవురించిన సుధ ముఖం చూసి మరోసారి ఫోటోలవంక చూసింది అరుణ!

ఇంటర్వ్యూలు చేసేప్పుడు, సుధ ఏమరుపాటుగా వున్నప్పుడు తీసిన ఫోటోలవి! టేప్‌రికార్డర్ పట్టుకుని కొద్దిగా ముందుకు వంగిన ఆమె ఎడమ వక్షం కనపడేలా తీసిందొకటి! నడుంపైని ముడతల్ని తీసిందొకటి! జాకెట్ క్రింద ఆచ్ఛాదన లేని వీపునీ, చెయ్యెత్తి ముఖం తుడుచుకుంటుండగా ఉబికిన ఛాతిభాగం ఒకటీ! ఇలా రకరకాల భంగిమలు! ఆమె శరీరాన్ని అతను సూక్ష్మంగా పరిశీలించిన దాఖలాలు!

'పీడ ముఖం మండా! ఏం చేశావే మరీ?' శాపనార్థాలు మొదలెట్టింది అరుణ!

తల రెండు చేతుల మధ్య పెట్టుకుని కణతలు నొక్కుకుంటూంది సుధ కళ్ళు మూసుకుని! "అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని ఎడిటర్‌కి కంప్లైంట్ చేశాను! పిలిచి బాగా తిట్టినట్లున్నాడాయన! సారీ చెప్పమని పంపాడు నాదగ్గరికి"

'పోన్లే తిక్క బాగా కుదిరింది వెధవకి' హాయిగా ఊపిరి పీల్చుకుంది అరుణ! కళ్ళు మూసుకునే వుంది సుధ! "దగ్గరకొచ్చి ఏమన్నాడో తెలుసా? సారీ సుధగారూ! మీ వారు అన్నయ్యగారంటున్నా మీరెప్పుడూ అలా పిలవకపోయేసరికి మరోలా అర్థం చేసుకున్నాను! సారీ" అని వెళ్ళిపోయాడు!

రెండు నిముషాలు మౌనంగా వుండిపోయారిద్దరూ!

"పాపం! మీ ఆయన అందుకే ముందు జాగ్రత్త కోసం అన్నయ్యగారూ అనమన్నాడు! నువ్వే తెచ్చుకున్నావ్ నెత్తిమీదికి!" నిష్ఠూరంగా అంది అరుణ!

తోసేసింది అరుణ!

నేనూ ఊరుకోను! "మొగుడుకట్టిన తాళి సౌఖ్యమా? మోపెడ్ ఎక్కి తిరగడం సౌఖ్యమా? అనే అంశం మీద డిబేటింగ్‌కి బాగానే ప్రిపేరయ్యాన్లే

బజ్జీల్ని సాస్‌లో ముంచి తలెత్తి "అయినా అరుణా! మనల్ని మనం నిరూపించుకోవడం ద్వారా వచ్చే ఆనందం ఉంది చూశావ్! ఓహ్! ఎంతగొప్పగా ఉంటుందో తెలుసా! గొలుసమ్మేందుకు మార్వాడీ దగ్గర కెళితే 'సినిమా హాలు దగ్గర కత్తిరించుకొచ్చావా? అన్నట్లు మాట్లాడాడు! నా జర్నలిస్ట్ కార్డ్ చూపించానంతే! బిత్తరపోయి, మర్యాదలు చేసి, తరుగుతీయకుండా ఎమౌంట్ ఇచ్చి నమస్కారాలు చేసిపంపాడు తెలుసా!" బజ్జీల మంటను మధురంగా ఫీలవుతున్న మొహం పెట్టింది సుధ!

'ఈ గోలంతా లేకుండా హాయిగా వాణ్ణి అన్నయ్యగారంటే పోయేది కాదూ?' సణిగిన అరుణ.

'అరుణా'! అన్న సుధ గద్దింపుకు ఉలిక్కి పడింది! "పవిత్రత అంటే చుట్టూ వున్న వాళ్ళతో చుట్టుముట్టించుకున్నంత కృతకమైన చుట్టరికాలు కలుపుకోవడం కాదే! ఎవరి మీదా ఆధారపడకుండా ఆత్మస్థైర్యంతో నిలబడగలగటమే నిజమైన పవిత్రత" చాచి ముఖాన కొట్టినట్టు ఖచ్చితంగా అంది సుధ!

నిర్ఘాంతపోయినదానిలా కాసేపు మౌనంగా వుండి ఆ మాటల సారమేదో బుర్రకెక్కినట్టు తలపంకిస్తూ కళ్ళజోడుతీసి గుండెమీద వేగంగా రుద్దుకుని అప్పటికే చల్లారిన కాఫీ గటగటా తాగేసింది అరుణ!

తనూ కాఫీ తాగేసి, "చీకటి పడుతోంది ఇకపోదామా?" "అసలే నాకవతల డిబేటింగ్ ఉందాయె" నవ్వుతూ లేచిన సుధవైపు ఆరాధనగా చూస్తూ, "అవునూ" దారే కదా నన్నుకూడా డ్రాప్ చేసెయ్యరాదూ!" అడిగింది అరుణ!

టేబుల్ అంచులు పట్టుకుని ముందుకువంగి అరుణ కళ్ళలోకి చూస్తూ "ఆధారపడకూడనిది, మగవాళ్ళమీదే కాదు! తోటి ఆడవాళ్ళమీద కూడా అని అండర్‌లైన్ చేసుకో డియర్?" నవ్వుతూనే అన్నా పదునుగా వున్న సుధ స్టేట్‌మెంట్‌కు గబుక్కున నాలుక్కరుచుకుని అప్పుడే వెయిటర్ తెచ్చిన బిల్లును చటుక్కున అందుకుంది అరుణ!

'గుడ్' భుజం తట్టింది సుధ! ●

వచ్చేవారం కథ: జమీన్

–మహమ్మద్ ఖదీర్‌బాబు